
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





రంజాన్ వేళలు
ఇఫ్తార్ - సోమవారం
సాయంత్రం - 6:36
సహర్ - మంగళవారం
ఉదయం - 4:42

పెద్దేముల్ మండలంలో సుద్ద అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతులు గోరంత.. తవ్వకాలు కొండంత అన్నచందంగా వ్యాపారులు తవ్వకాలు యథేచ్ఛగా జరుపుతున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ విధానాలు కూడా అందుకు కారణమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమాలు జరగకుండా ఉండేందుకు అనుమతులు పొందిన సర్వేనంబర్‌కు సంబంధించి పొలాల్లో మైన్స్ అధికారులు కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల అనుమతులు ఇచ్చిన పొలంలో హద్దులు లేకపోవడం అక్రమార్కులకు కలిసివస్తోంది.



మారెపల్లిలో సుద్ద తవ్వకాలు



సుద్దకు లేదు హద్దు!

అనుమతులు ఒకచోట.. తవ్వకాలు మరోచోట

- పెద్దేముల్ మండలంలో జోరుగా సుద్ద అక్రమ తవ్వకాలు
- ఎవరికీ అనుమానం రాకుండా వ్యాపారుల జాగ్రత్తలు
- అనుమతుల సమయంలో హద్దులు ఏర్పాటు చేయని మైనింగ్ అధికారులు
- అదే అదనుగా రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి

పెద్దేముల్/తాండూరు, ఏప్రిల్ 7: పెద్దేముల్ మండలంలో మారెపల్లి, జనగాం, తింసాన్‌పల్లి, గోపాల్‌పూర్, రుద్రారం తదితర గ్రామాల్లో సుద్ద నిక్షేపాలు దండిగా ఉన్నాయి. ఇక్కడ సుద్ద తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి వ్యాపారులు సుద్ద తవ్వకాలు జరుపుతూ సుద్దను విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. అయితే, సుద్ద తవ్వకాల కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు పొంది తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. కానీ, నాలుగైదు సంవత్సరాలుగా సుద్ద తవ్వకాలకు లీజులు రావడం గగనమైంది. దీంతో సుద్ద వ్యాపారులు అక్రమాలకు తెరతీస్తున్నారు. సుద్ద తవ్వకాల కోసం ముందుగా తహసీల్దార్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ) తీసుకోవాలి. ఆ తర్వాత మైనింగ్‌శాఖ ద్వారా అనుమతులు పొందాలి. అందుకు అన్ని నిబంధనలు పూర్తిచేసిన తరువాత మైనింగ్‌శాఖ అనుమతులు ఇస్తుంది.

హద్దులు లేకపోవడంతో..

అక్రమాలు జరగకుండా ఉండేందుకు అనుమతులు పొందిన సర్వేనంబర్ ప్రాంతంలో మైన్స్ అధికారులు కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ, మైన్స్ అధికారులు చాలాచోట్ల అనుమతులు ఇచ్చిన పొలంలో హద్దులు ఏర్పాటు చేయడం లేదు. ఇదే అక్రమార్కులకు కలిసివస్తోంది. ఒక సర్వేనంబర్‌లో 10 ఎకరాలు పొలం ఉందనుకుంటే వ్యాపారులు ఇక్కడ రెండు, మూడు ఎకరాలకు లీజులు తీసుకుంటారు. ఆ లీజులకు గడువు కూడా పదేళ్ల వరకు ఉంటోంది. దీంతో వ్యాపారులు తీసుకున్న రెండు మూడెకరాల లీజుతోనే మొత్తం 10ఎకరాలు తవ్వేస్తున్నారు. ఎవరైనా వెళ్లి అడిగితే తమకు లీజు ఉందని చూపిస్తున్నారు. అలా గోరంత అనుమతులు తీసుకుని కొండంత తవ్వేస్తున్నారు. ఎప్పటికప్పుడు మైనింగ్ అధికారులు పరిశీలించాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు. ఎప్పుడైనా, ఎవరైనా ఫిర్యాదు చేస్తే చుట్టపుచూపుగా వెళ్లి వచ్చి అది సక్రమంగానే ఉందని చెబుతున్నారు.



మారెపల్లిలో చెరువును తలపించేలా సుద్దతవ్వగా ఏర్పడిన గుంతలు

యంత్రాలతో తవ్వకాలు..

సుద్ద తవ్వకాలు ఇప్పుడు పూర్తిగా యంత్రాల ద్వారానే జరుగుతున్నాయి. ఎకరం పొలంలో సుద్ద తవ్వి తీసేందుకు కేవలం 40 నుంచి 50 రోజులు సరిపోతుంది. కర్ణాటక తరహాలో యేడాది గడువుతో లీజులు ఇస్తే అక్రమాలు జరిగే అవకాశం లేకుండాపోతుంది. లీజులకు పదేళ్ల గడువు ఇవ్వడంతో అక్రమవ్యాపారులు ఒక అనుమతితో ఆ సర్వే నంబర్‌లోని మొత్తం పొలంలో తవ్వకాలు జరుపుతున్నారు. అక్రమాలను సక్రమంగా చూపుకుంటున్నారు.

కర్ణాటక తరహాలో లీజుకు ఇస్తే...

కర్ణాటక రాష్ట్రంలో సుద్ద తవ్వకాల కోసం లీజుకు దరఖాస్తు చేసుకుంటే ముందుగా సర్వేయర్ వచ్చి అస్థలాన్ని పూర్తిగా సర్వే చేస్తారు. లీజుదారుడు పెట్టుకున్న అర్జీ ప్రకారం ఎన్ని ఎకరాలకు లీజు దరఖాస్తు చేస్తే అన్ని ఎకరాలు ముందు కొలుస్తారు. ఆతరువాత నిబంధనల ప్రకారం వారికి లీజు ఇస్తారు. అది కూడా ఒక యేడాదికి మాత్రమే. లీజు పొందిన వ్యాపారి కాని రైతుకాని తవ్వకాలు చేపట్టి సుద్దను బయటకు తీశాక దానిని మైన్స్ అధికారులు ఎన్ని టన్నులు ఉంటుందని అంచనావేసి దాని ప్రకారం రాయల్టీ ఇస్తారు. అది కూడా సుద్ద తవ్విన గుంతను పూర్తిగా మట్టితో పూడ్చి చదును చేశాకే వారికి రాయల్టీ ఇస్తారు. దీని వల్ల అక్కడ గోతులు కూడా లేకుండా పొలం సాగుచేసుకునేందుకు అవకాశం కలుగుతుంది. అక్రమాలకు తావులేకుండా ఉంటుంది.



పెద్దేముల్ మండలం జనగాం శివారులో సుద్ద తవ్వకాలు

ఎక్కడ చూసినా గుంతలే..

పెద్దేముల్ మండలంలో సుద్ద వ్యాపారులకు నిబంధనలు ఏవీ లేవనిపిస్తోంది. సుద్ద తవ్విన చోట గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రమాదవశాత్తు పశువులు, మనుషులు కూడా వాటిలో పడి చనిపోతున్నారు. తవ్విన గుంతలు పూడ్చాలనే నిబంధనలు ఇక్కడ కూడా ఉన్నా ఎవరు పట్టించుకోవడం లేదు. తవ్విన గుంతలను వ్యాపారులు పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు.

లీజును సులభతరం చేయాలి

సుద్ద తవ్వకాల కోసం లీజును సులభతరం చేయాలి. అక్రమాలను అరికట్టేందుకు నిబంధనలు కఠినంగా తయారుచేయాలి. లీజులు సులభతరం చేయడం వల్ల అక్రమ తవ్వకాల వైపు ఎవరూ వెళ్లేందుకు ప్రయత్నం చేయరు. లీజులు ఇచ్చేముందే దరఖాస్తు చేసుకున్న సర్వే నంబర్ మొత్తం పర్యవేక్షించాలి. ఎన్ని ఎకరాలకు దరకాస్తు చేసుకున్నారో.. అన్ని ఎకరాల వరకు హద్దులు ఏర్పాటు చేయాలి. తవ్వకాలకు యేడాది మాత్రమే గడువు ఇవ్వాలి. తవ్విన గుంతలు పరిశీలించి తీసిన సుద్దకు కొలతలు వేయాలి. తవ్విన గుంతలను పూర్తిగా పూడ్చివేయించిన తరువాతనే వారికి సుద్ద తరలించేందుకు రాయల్టీలు ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల పకడ్బందీగా అక్రమాలు అరికట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వానికి రాబడి పెరుగుతుంది.

అక్రమ సుద్దకు రాయల్టీలు

అక్రమంగా సుద్ద తవ్వకాలు జరిపినా.. వాటికి రాయల్టీలు లభిస్తున్నాయి. సుద్ద తవ్వకాల కోసం గతంలో అనుమతులు పొందినవారు అక్రమంగా తవ్విన సుద్దకు వారిపేరున రాయల్టీలు తీసుకుని సుద్దను తరలిస్తున్నారు. దీంతో అక్రమాలు సైతం సక్రమంగా మారుతున్నాయి. ఇక కొంతమేర స్థానికంగా ఉన్న ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. అక్రమంగా సుద్ద తవ్వకాలు జరిపిన వారి నుంచి స్థానికంగా ఉన్న ఫ్యాక్టరీల యాజమాన్యం తక్కువ ధరకు సుద్దను కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

కేంద్రంలో బీజేపీ.. రాష్ట్రంలో బీఆర్ఎస్

- పదేళ్లుగా దోపిడీకి పాల్పడిన పార్టీలు
- కేంద్రంలోనూ కాంగ్రెస్‌దే అధికారం
- చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగరేస్తాం
- పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 7 : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు పదేళ్లపాటు దోపిడీకి పాల్పడ్డాయని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సాయంత్రం పరిగిలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలో అతిపెద్ద స్కాంలు, అవినీతి, అక్రమాలు ఏ ప్రభుత్వంలో జరగలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాయని విమర్శించారు. ఏ నాయకుడైనా సరే.. చేసిన పాపాలకు శిక్ష అనుభవించక తప్పదన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి లక్షల కోట్లు కొల్లగొట్టుకుపోయిన బీఆర్ఎస్ నాయకులు జైలుపాలు కాక తప్పదని అన్నారు. కేంద్రంలో బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖతమైపోయిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితోనే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు. చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగరవేయడం ఖాయమన్నారు. గత ఎన్నికల్లో పరిగి నుంచి 25 వేల మెజారిటీ ఇచ్చారని, ఇదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లో 50 వేల మెజార్టీని తీసుకొస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ఖతమైందని, ఆ పార్టీలోని కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంతోపాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు 24 గంటలూ పని చేస్తున్నామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు పరిగి నియోజకవర్గం సమీపం నుంచి వెళ్లేలా చేస్తామని సీఎం ఒప్పుకున్నారని చెప్పారు. దేశానికే తలమానికంగా నిలిచే నేవీ రాడార్ స్టేషన్ పరిగిలో ఏర్పాటు కావడం చరిత్ర పుటల్లో లిఖించదగిన విషయమని అన్నారు. ఆరుగ్యారంటీ పథకాలు సంపూర్ణంగా అమలు చేస్తామని, ప్రతీ నియోజకవర్గానికి మొదటి దశలోనే 3,500 ఇళ్లు నిర్మించబోతున్నామని చెప్పారు. విద్యుత్‌కు సంబంధించి ఇప్పటికే 200 యూనిట్ల లోపు వాడకందారులకు జీరో బిల్లులు ఇస్తున్నట్లు తెలిపారు. దశలవారీగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బి.పరుశరాం రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, డీసీసీ కార్యదర్శులు ఎస్.రామకృష్ణ, పాలాది శ్రీనివాస్, నాయకులు జె.అశోక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, నవాజ్, రవినాయక్‌లు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఉద్యమకారులు, కళాకారులకు

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ యుద్ధభేరి నాయకురాలు విమలక్క

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 7: రాష్ట్ర ప్రభుత్వం కళాకారులను గుర్తించాలని, కొడంగల్ నియోజకవర్గంలో ఉద్యమకారులు, కళాకారులకు ఇళ్ల స్థలాల కేటాయించి ఇళ్లు నిర్మించాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ యుద్ధభేరి నాయకురాలు విమలక్క డిమాండ్ చేశారు. ఆదివారం బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం గ్రామంలో అరుణోదయ కళాకారుల ఆత్మీయ సమ్మేళనానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ అరుణోదయ సాంస్కృతిక సమైక్య ఆధ్వర్యంలో తిరిగి నీళ్లు, నిధులు, నియామకాల కోసం మరో ఉద్యమాన్ని ప్రారంభించాలని పిలుపునిచ్చారు. కొడంగల్‌కు గత ప్రభుత్వాలు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో సాగునీరు తీసుకొస్తామని మాయమాటలు చెప్పి.. ఓట్లు వేయించుకొని ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సాగు, తాగునీటిని అందిస్తే ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. కొడంగల్ ప్రాంతానికి సాగునీరందించే విధంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్, భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా అధ్యక్షుడు అరుణ్‌నాయక్, రాజ్యాంగ పరిరక్షణ సమితి తాలూకా కన్వీనర్ శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం నాయకులు వెంకట్, కళాకారులు బలరాం, శంకర్‌నాయక్, చెన్నప్ప, రాములు, అనిత, బీసీ సంఘం నాయకులు శ్రీశైలం, పరమేశ్, సునిత, విజయ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న విమలక్క

వైభవంగా కల్పవృక్ష వాహన సేవ



కల్పవృక్ష వాహన సేవలో పాల్గొన్న భక్తులు

కొడంగల్, ఏప్రిల్ 7 : కొడంగల్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 44వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయ మాడ వీధుల్లో స్వామివారికి కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా కొడంగల్ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలంగాణ సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాస్, టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున వేంకటేశ్వర స్వామి వారికి శేషవస్త్రాలు సమర్పించారు.

నిప్పుల కొలిమి!

- మేడ్చల్ జిల్లా ఘన్‌పూర్‌లో

అత్యధికంగా 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : భానుడు భగ్గుమంటున్నాడు. నిప్పుల కొలిమిని తలపిస్తున్నాడు. ఉదయం 8 దాటితే చాలు సుర్రుమంటున్నాడు. మధ్యాహ్న సమయంలో నిప్పులు చిమ్ముతున్నాడు. సాయంత్రం 5గంటలు దాటినా శాంతించడం లేదు. ఎండ వేడిమికి వడగాలులు వీస్తున్నాయి. రాత్రి వేళలో ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఆదివారం మేడ్చల్ జిల్లా ఘన్‌పూర్‌లో అత్యధికంగా 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా యాలాల్‌లో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం నియోజకవర్గం మంగల్‌పల్లిలో 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



ప్రారంభానికి నోచని రాష్ట్ర మత్స్య శిక్షణా కేంద్రం

- ఐదు ఎకరాల్లో రూ.6కోట్లతో నిర్మాణం
- అందుబాటులోకి తేవాలని మత్స్యకారుల విన్నపం

మేడ్చల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మత్స్య శిక్షణా కేంద్రాన్ని మేడ్చల్‌లో నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. మేడ్చల్ చెక్‌పోస్టు నుంచి మేడ్చల్‌కు వెళ్లే దారిలో జాతీయరహదారి పక్కనే 5 ఎకరాల్లో దాదాపు రూ.6 కోట్లతో రాష్ట్ర మత్స్య శిక్షణా కేంద్రాన్ని నిర్మించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాకినాడలో మాత్రమే రాష్ట్ర మత్స్య శిక్షణా కేంద్రం ఉండేది. రాష్ట్రం విడిపోయిన తరువాత మేడ్చల్‌లో శిక్షణా కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం మేడ్చల్‌లో ఏర్పాటు చేసింది. ప్రస్తుతం భవన నిర్మాణం పూర్తయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. కాగా, ఈ కేంద్రంలో ఆడిటోరియం, ల్యాబ్ కొరకు ప్రత్యేక భవనం, అడ్మిన్ భవనాలను నిర్మించారు. అదేవిధంగా ఇక్కడ శిక్షణ తీసుకునే వారు ఉండేందుకు హాస్టల్ భవనాన్ని కూడా నిర్మించారు. రాష్ట్రంలోని మత్స్య సంఘాల సభ్యులకు చేపల పెరుగుదల, వాటికి సోకే రోగాలు, ఉత్పత్తి తదితర అంశాలపై ఈ కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నారు. సంవత్సరానికి మూడు బ్యాచ్‌ల చొప్పున శిక్షణ అందిస్తారు. ముఖ్యంగా ఆక్వా కల్చర్‌పై శిక్షణ ఇక్కడ అందిస్తారు. రాష్ట్రంలో నీటి వనరులు, అనువైన భూములు, అవసరమైన మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉండటంతో మత్స్య సంపదను అభివృద్ధి పరిచి మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. ముఖ్యంగా ఆక్వా కల్చర్‌ను సుస్థిర పరుచుటకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. శిక్షణ కేంద్రంలో దాదాపు రూ.50 లక్షలతో ఆక్వా ల్యాబ్‌లను కూడా ఏర్పాటు చేస్తోంది. ఈమేరకు చేపల పెంపకంలో భాగంగా రైతులకు సాంకేతిక పరమైన సలహాలు, సూచనలు అందించడంతో పాటు ఆక్వా రైతులకు నాణ్యమైన ఇన్‌పుట్స్ అందేటట్లు చూడటం, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల ద్వారా నిరంతరంగా వ్యాధుల పర్యవేక్షణ, నివారణ తదితర అంశాలపై మత్స్య సంఘాల సభ్యులకు శిక్షణ అందిస్తారు. చేపల పెంపకంలో సులువైన పద్ధతులు, పర్యావరణ సంరక్షణపై శాస్త్రీయ పరిశీలన చేపట్టడం, పర్యావరణ అనుకూల పెంపకం వంటి పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. ఆక్వా కల్చర్‌లో ఉత్పన్నమయ్యే సామాజిక, ఆర్థిక విషయాలు, సాంకేతికపరమైన అంశాలు, అవలంభించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇక్కడ అలంకరణ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఉండేది. ఇళ్లల్లో అక్వేరియంలో పెంచుకునే విధంగా అలంకరణ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో రంగురంగుల చేప పిల్లలను ఉత్పత్తి చేసి విక్రయించేవారు. కొన్ని సంవత్సరాల తరువాత అలంకరణ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం మరుగునపడిపోయింది. దాంతో ఆ కేంద్రాన్ని మూసివేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలోని మత్స్యకారుల కోసం శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలతో నిర్మాణం పూర్తయినప్పటికీ టీఎస్ఎఫ్‌టీఐ ప్రారంభానికి నోచుకోవడం లేదు. కాగా, గత ప్రభుత్వ హయాంలోనే కేంద్రాన్ని ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వమైన టీఎస్ఎఫ్‌టీఐని ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లాలోని మత్స్యకారులు కోరుతున్నారు.



మేడ్చల్‌లో నిర్మించిన మత్స్య శిక్షణా కేంద్రం

అడ్మిన్ బ్లాక్



'ఉపాధి' కూలి పెంపు

దోమ, ఏప్రిల్ 7: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.272 నుంచి 300 వరకు ఏప్రిల్ 1 నుంచి పెంచినట్లు ఎంపీడీవో మహేశ్‌బాబు తెలిపారు. మండలంలోని మోత్కుర్ గ్రామంలో ఆదివారం కూలీలతో ఆయన మాట్లాడారు. మండలంలో 13521 ఉపాధి కూలీలు ఉన్నారని, పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కూలీలు అధిక సంఖ్యలో పనికి వచ్చేవిధంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్ఎంఎస్ యాప్ ద్వారా కూలీల హాజరుశాతాన్ని నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు.



మోత్కుర్‌లో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో మహేశ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

- మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఏప్రిల్ 7 : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని గణపతి గార్డెన్స్‌లో ఆదివారం కాంగ్రెస్ కొత్తూర్ మున్సిపాలిటీ, కొత్తూర్, నందిగామ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి వంశీచంద్‌రెడ్డి, శంకర్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాసుందర్‌రెడ్డి, కొత్తూర్, నందిగామ మండలాల అధ్యక్షులు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహా, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, కుమారస్వామిగౌడ్, నాయకులు శివశంకర్‌గౌడ్, తులసీరాంనాయక్, గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల యువత ఆసక్తి కనబర్చాలి

- పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి



బహుమతులు అందజేస్తున్న జంగారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 7 : క్రీడల పట్ల యువత ఆసక్తిని కనబర్చాలని మాజీ జడ్పీటీసీ, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి అన్నారు. మూడు రోజులుగా మండలంలోని దెబ్బగూడ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం సాయంత్రం స్థానిక నాయకులు ఎల్మటి దేవేందర్‌రెడ్డి, జిట్ట రాజేందర్‌రెడ్డితో కలిసి జంగారెడ్డి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి గెలుపొందిన క్రీడాకారులకు ఏనుగు జంగారెడ్డి రూ.లక్ష నగదు, ద్వితీయ బహుమతి గెలుపొందిన వారికి ఎల్మటి దేవేందర్‌రెడ్డి, రూ.లక్ష నగదు, తృతీయ బహుమతి గెలుపొందిన వారికిజిట్ట రాజేందర్‌రెడ్డి రూ.50వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ ఎల్మటి లక్ష్మీ, మండల పరిషత్ కో-ఆప్షన్ మెంబర్ ఎండి సులేమాన్, మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి, మాజీ ఉపసర్పంచ్ చంచు గణేష్, నాయకులు దయాకర్‌రెడ్డి, బండ నర్సింహ, తీగల జగదీశ్వర్‌రెడ్డి, మనోహర్‌గుప్తా, జైపాల్‌నాయక్, డి.జంగయ్య, శ్రీనివాస్‌గుప్తా, రాఘవేందర్‌గుప్తా, నీలం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెంచుడు.. నరుకుడు!



బషీరాబాద్ ప్రధాన మార్గంలో నరికివేసిన చెట్టు

బషీరాబాద్, ఏప్రిల్ 7: హరితహారం కార్యక్రమంలో భాగంగా రహదారుల పక్కన నాటిన మొక్కలను పెంచి.. చెట్లుగా మారిన క్రమంలో నరికివేస్తున్నారు. బషీరాబాద్-తాండూరు ప్రధాన ఆర్అండ్‌బీ మార్గంలో కాశీంపూర్ సమీపంలో హరితహారం కింద ఫారెస్ట్ అధికారులు మొక్కలను నాటించి, గత ఐదారేళ్లుగా సంరక్షిస్తూ వచ్చారు. అయితే రహదారి పక్క నుంచి సమాంతరంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగాలకు తగిలి కరెంట్ సరఫరాకు ఆటంకంగా మారుతున్నాయనే కారణంతో విద్యుత్‌శాఖ సిబ్బంది చెట్ల మొదళ్లతో కొమ్మలను ఇలా నరికివేశారు. అటవీశాఖ అధికారులు లక్షల రూపాయలు వెచ్చించి ఓ పక్క మొక్కలు పెంచుతుంటే విద్యుత్‌శాఖ వాటిని నరికివేస్తుండటంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తాటిముంజలకు కేరాఫ్ అంతారం



తాటిముంజలు విక్రయిస్తున్న వ్యాపారులు

కులకచర్ల, ఏప్రిల్ 7: అంతారం గ్రామం తాటి ముంజలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. గ్రామంలోని దాదాపు వందకు పైగా కుటుంబాలు తాటి ముంజలు విక్రయించి ఉపాధి పొందుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఈ తాటి ముంజలను వీటిని పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఇష్టపడతారు. ముఖ్యంగా వేసవి కాలంలోనే విరివిగా లభిస్తాయి. వేసవి సెలవులకు గ్రామీణ ప్రాంతాలకు వచ్చే వారు తాటి ముంజలు కచ్చితంగా తింటారు. ఇవి మండలంలోని అంతారం, తిరుమలాపూర్, ఇప్పయిపల్లి గ్రామాల్లో ఎక్కువగా లభిస్తాయి. ఇక్కడ ముంజలంటే తెలియని వారుండరు. వాటిని ప్రతీ ఒక్కరు ఇష్టపడతారు. ఇప్పుడు పట్టణాల్లో కూడా లభిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి తీసుకువెళ్లి పట్టణాల్లో అమ్మకాలు చేస్తున్నారు. తాటి ముంజలు శరీరంలోని చక్కెర, ఖనిజ లవణాలను సమతుల్యం చేస్తాయి. తాటి మంజలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇక్కడి నుంచి పరిగి, పాలమూర్, హైదరాబాద్, రాయచూర్, గుల్బర్గ, సంగారెడ్డి, సదాశివపేట తదితర ప్రాంతాలకు తరలించి అమ్ముతుంటారు. తాటిముంజల విక్రయంతో రెండు నెలల పాటు ఉపాధి పొందుతారు.



భారీ మెజార్టీతో రంజిత్‌రెడ్డి గెలుపు తథ్యం

చందానగర్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి అధిక మెజార్టీతో గెలవడం తథ్యమని ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ జైపాల్ అన్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు చెందిన వడ్డెర సామాజిక వర్గ నాయకులతో సమీక్షా సమావేశం చందనగర్‌లో ఆది వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమైందన్నారు. దేశంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపిస్తే ఈ ప్రాంత ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. రంజిత్‌రెడ్డి కోసం కార్యకర్తలు సైనికుల పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, వడ్డెర సంఘం నాయకులు లింగయ్య, రాష్ట్ర అధ్యక్షుడు సత్యానారాయణరాజు, ఉపాధ్యక్షుడు అనంతయ్య, సెక్రటరీ కృష్ణయ్య, కార్యదర్శి విఠల్ తదితరులు పాల్గొన్నారు.



ఫహీమ్ ఖురేషీకి ఖర్జూర తినిపిస్తున్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి



మాట్లాడుతన్న ఎంబీసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జైపాల్

ఇఫ్తార్ విందులో రంజిత్‌రెడ్డి

రాజేంద్రనగర్ (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషీ ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లిలోని ఎస్ఎన్‌సీ కన్వెన్షన్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ విందులో రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ప్రముఖక్రికెటర్, కాంగ్రెస్ నాయకుడు అజహరుద్దీన్‌లతో పాటు పలు కార్పొరేషన్ల చైర్మన్లు బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఒబేదుల్లా కొత్వాల్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై ప్రచారం

తాండూరు, ఏప్రిల్ 7: పార్లమెంటు ఎన్నికల్లో ఎన్నికల నియామవళిని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అధికార యంత్రాగం చర్యలను ముమ్మరం చేసింది. ఎన్నికల నియామవళి, ఓటుహక్కు వినియోగం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే ఫిర్యాదు ఎలా చేయాలి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వంటి అంశాలను వివరిస్తూ తాండూరు మున్సిపాలిటీలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఈ విషయాలైన సి-విజల్, ఎంససి యాప్ వంటి వాటిని వివరించే బ్యానర్లను కట్టారు. పట్టణంలో ప్రధాన కూడళ్లు అయిన ఇందిరాచౌక్, శివాజీచౌక్, విలియమూన్ చౌరాస్తా, భదేశ్వర్‌చౌక్, శాంతమహల్ చౌరస్తా, రైల్వే స్టేషన్‌రోడ్డు, కొడంగల్ రోడ్డు, మార్గాల్లో ఈ బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఓటు హక్కును వివరిస్తూ 5కె రన్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఈ బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లఘించే పార్టీలపై ఫిర్యాదులు చేసేందుకు సి-విజిల్ యాప్‌ను వినియోగించుకోవాలని బ్యానర్ల ద్వారా ఓటర్లకు వివరించారు.



తాండూరులో ఫ్లైఓవర్‌పై ఏర్పాటు చేసిన బ్యానర్



ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

తాండూరురూరల్, ఏప్రిల్ 7: మండలంలోని ఐనెల్లి శివారులోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం జరిగింది. మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 6వతరగతి నుంచి 10వ తరగతుల్లో ప్రవేశానికి 169 మంది విద్యార్థులుదరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 133మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 36మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 7 నుంచి 10వ తరగతుల వరకు ప్రవేశానికి 265 మంది దరఖాస్తు చేసుకోగా 200మంది పరీక్ష రాశారు. 65 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న విష్ణుమూర్తి

జాతీయ స్థాయి పోటీల్లో అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థుల ప్రతిభ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 7: ఐఐటీ-హైదరబాద్ ఫోర్జ్ విద్యార్థి 24గంటల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులు సత్తాచాటారు. యూనివర్సిటీలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెలిచిన విద్యార్థులను అనురాగ్ యూనివర్సిటీ సీఎస్‌సీ హెచ్‌వోడీ జి.విష్ణుమూర్తి బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జాతీయస్థాయి హ్యాకథాన్‌లలో పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయ్‌కుమార్, అచ్యుత్, అభిలాష్‌రెడ్డి, రౌత్ సందీప్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

గడువు ముగిసినా అక్రమ వసూళ్లు?

- పరిగి తైబజార్‌లో గుత్తేదారు ఇష్టారాజ్యం
- అధికారుల ఆదేశాలు బేఖాతర్
- వసూలు చేసే డబ్బు ఎవరెవరి ఖాతాల్లోకి?

పరిగి, ఏప్రిల్ 7 : పరిగి మార్కెట్‌లో నిర్వహిస్తున్న తైబజారులో డబ్బులు అక్రమంగా వసూలు చేస్తున్నారు. తైబజారుకు వేలం నిర్వహించని కారణంగా డబ్బులు వసూలు చేయకూడదని అధికారులు చెప్పినా.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ దృష్ట్యా తైబజార్‌కు వేలం నిర్వహించలేదు. గతేడాది తైబజార్ వసూళ్లకు సంబంధించి గుత్తేదారు గడువు మార్చి 31తో ముగిసింది. ఏప్రిల్ ఒకటి నుంచి మళ్లీ వేలం నిర్వహించి డబ్బులు తైబజార్‌లో డబ్బు వసూలు చేసుకునేందుకు అవకాశమిస్తారు. కాగా, ఎన్నికల కోడ్ కారణంగా తైబజార్‌కు రైతులు, వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని పత్రికలు, నోటీస్ బోర్డుల ద్వారా మునిసిపల్ అధికారులు ప్రచారం కల్పించారు. అయినా, ఇదంతా పట్టించుకోకుండా ఏప్రిల్ ఒకటి తర్వాత కూడా గతంలోని గుత్తేదారు డబ్బులు దర్జాగా వసూలు చేస్తున్నాడు. సాధారణ రోజుల్లోనే వేలల్లో వసూలవుతుండగా.. సంత జరిగే శుక్ర, శని వారాల్లో భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నారు. అధికారులు వద్దన్నారు కదా? అని పలువురు రైతులు, వ్యాపారులు నిలదీస్తే తూకం వేసే బాట్లతో దాడులకు దిగిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. కాగా, ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు, రైతులు వాపోతున్నారు. వారం రోజులుగా పరిగి మార్కెట్‌లో నిబంధనలకు విరుద్ధంగా తైబజారుకు సంబంధించి డబ్బులు వసూలు చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, ఈ డబ్బులో అధికారులకు కూడా వాటా ఇస్తున్నామని వసూలు చేసినవారే చెబుతుండడం గమనార్హం.



పరిగిలో కొనసాగుతున్న సంత

బలవంతంగా వసూలు చేస్తున్నారు



అధికారులుతైబజారుకు సంబంధించి డబ్బులు ఇవ్వకూడదని చెబుతున్నారు. అయితే, ఆచరణలో అందుకు విరుద్ధంగా ఉంది. గతంలో వసూలు చేసినవారే తిరిగి వసూలు చేస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు తాము డబ్బు చెల్లించమని చెబితే బెదిరిస్తున్నారు. కొందరిపై తూకం చేసే బాట్లతో దాడికి దిగుతున్నారు.

- ఆకుల కృష్ణ, చిరువ్యాపారి, పరిగి

తైబజారు డబ్బులు ఎవరికీ ఇవ్వొద్దు



పరిగి మునిసిపల్ పరిధిలో వ్యాపారస్తులు, చిరువ్యాపారులు, రైతులు తైబజారుకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. గుత్తేదారు తైబజార్ వసూళ్ల కాల పరిమితి మార్చి 31తో ముగిసింది. ఎవరు కూడా డబ్బులు చెల్లించవద్దు. డబ్బులు అక్రమంగా వసూలు చేసినవారిపై చర్యలు తీసుకుంటాం. మునిసిపల్ కార్యాలయంలో ఫిర్యాదు కూడా చేయవచ్చు.

- వెంకటయ్య, మునిపిపల్ కమిషనర్, పరిగి

కాంగ్రెస్ వాగ్దానాలను ప్రజలు నమ్మరు

చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 7: ఇటు రాష్ట్రంలో.. అటు దేశంలోనూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న వాగ్దానాలను ప్రజలు నమ్మడంలేదని మాజీ ఎంపీ, బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండావిశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు.వికారాబాద్ మండలం పీలారం,రాళ్లచిట్టంపల్లి, ద్యాచారం, గొట్టిముక్ల, కామారెడ్డిగూడ, పాతూరు, సిద్దులూరు గ్రామాల్లో ఆదివారం ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎక్కడికి వెళ్లినా బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. మరోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటు కోసం సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆదరణ కోల్పోయిందన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌లో బీజేపీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరూ బీజేపీ వెంట ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ నరేంద్రమోదీనే ప్రధాని

ధారూరు: నరేంద్రమోదీ మళ్లీ భారతప్రధాని అవుతారని, బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజాఆశ్వీరాద యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని మున్నూర్ సోమారం, గడ్డమీది గంగారం, నాగారం, మోమిన్‌కలాన్, ధారూరు గ్రామాల్లో ఆయన పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీకి పోటీయేలేదన్నారు.గ్రామాల్లో కరెంట్, నీటి సమస్య నెలకొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. గ్రామాల్లో ఉపాధి రోడ్లు, రేషన్ బియ్యం, మరుగుదొడ్ల నిర్మాణం కేంద్ర ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఇక్కడ బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.రమేశ్, నాయకులు పాండుగౌడ్, వివేకానందరెడ్డి, నరోత్తంరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, కేపీ రాజు, రాజేందర్‌గౌడ్, విజయలక్ష్మి, రవీందర్‌గౌడ్, రాఘవేందర్ గౌడ్, సాయిగౌడ్, శ్రీకాంత్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.



చాపలగూడంలో ప్రచారం నిర్వహిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కొండా సమక్షంలో బీజేపీలో చేరికలు

ధారూరు మండలంలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు నాయక్‌తో పాటు ఆయన భార్య మాజీ ఎంపీపీ ఉమాపార్వతి ఆదివారం బీజేపీలో చేరారు. వీరితో పాటు కొండాపూర్‌కలాన్, నాగసముందర్, స్టేషన్ ధారూరు, రుద్రారం గ్రామాల తాజా మాజీ సర్పంచులు పరమేష్, చంద్రకళ, రేణుకా, చంద్రమ్మలతో పాటు నాయకులు రాంచందర్, అనిల్, శ్రీనివాస్, రాములు, లక్ష్మారెడ్డిలు బీజేపీలో చేరారు. వీరికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి అభినందనలు తెలిపారు.

విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

కులకచర్ల: కులకచర్ల మండలంలోని చాపలగూడెం, తిరుమలపూర్ గ్రామాల్లో ఆదివారం చేవేళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లతో అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కొండ విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి డాక్టర్ మీరారెడ్డి, పిన్ని డాక్టర్ కల్పన రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి, రామచంద్రయ్య, గోపాల్ పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు కొండా..

చేవెళ్ల : బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మచ్చలేని నాయకుడు అని బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వర్‌రెడ్డి చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదన్నారు. ఆయనపై ప్రత్యర్థులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలన్నారు. చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు దేవుని శర్వలింగం, వెంకట్‌రాంరెడ్డి, నాగరాజుగౌడ్, అమర్‌నాథ్‌రెడ్డి, హన్మంత్, కృష్ణ ఉన్నారు.

నేడు పూలపల్లిలో పర్యటన

చేవెళ్ల మాజీ ఎంపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర నేడు చేవెళ్ల నియోజకవర్గంలోని నవాపేట్ మండల పరిధిలోకి చేరుకుంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వర్‌రెడ్డి కొనసాగిస్తున్న ప్రజాఆశీర్వాద యాత్ర నవాపేట్ మండలంలోని పూలపల్లి, నారేగూడ, గంగ్యాడ, మైతాఫ్‌ఖాన్‌గూడ తదితర గ్రామాల్లో సోమవారం కొనసాగుతుందన్నారు. ప్రజలు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ధారూరులో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ఎంపీగా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి

రాజేంద్రనగర్ : చేవెళ్ల ఎంపీగా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి కోరారు. రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ సింఫనీ విల్లాస్‌లో ఆదివారం ఆమె ఓటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకుసేవచేయాలనే సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చారని చెప్పారు. ఎంపీగా ఉన్నప్పుడు చేవెళ్ల అభివృద్ధికి ఆయన కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎస్.మల్లారెడ్డి, ఎస్.విజయ్‌కుమార్, మోంద్ర సంగీత, గౌరీశంకర్, కొండా గౌతమిరెడ్డి, పాల్గొన్నారు.కాగా చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. డివిజన్‌లోని బాబుల్‌రెడ్డినగర్‌లో ఆదివారం కార్పొరేటర్ ఆధ్వర్యంలో వ్యాపార సముదాయాల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

ప్రధాని మోదీకి అండగా నిలవాలి: అనితారెడ్డి

హైదర్‌నగర్: దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోదీకి అందరూ అండగా నిలవాలని చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి సోదరి అనితారెడ్డి అన్నారు. ఆదివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్‌లో విశ్వేశ్వరరెడ్డిని గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. మణిభూషణ్, అశోక్, నరేష్, శ్రీనివాస్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా నార్సింగ్ గ్రామంలోని అల్కాపూర్ కాలనీలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుకోసం కొండా సంగీతారెడ్డి ప్రచారం నిర్వహించారు. పార్కులో వాకర్స్‌తో మాట్లాడారు.

బీఆర్ఎస్‌కు వడ్ల నందు రాజీనామా



వడ్లనందు

వికారాబాద్, ఏప్రిల్ 7: లోక్‌సభ ఎన్నికల్లో నేపథ్యంలో వికారాబాద్ బీఆ రఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ వైఖరి నచ్చక తాను బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వడ్ల నందు ఒక ప్రకటన తెలిపారు. రాజీ నామా పత్రాన్ని అధిష్టానానికి పంపిం చినట్లు తెలిపారు. ఆనంద్ ఉద్యమకా రులకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా అహంకారపోకడలకు పోతున్నారని మండిపడ్డారు. కొంత కాలంగా తనకు పార్టీలో తగిన ప్రాధాన్యత లేని కారణంగా పార్టీకి రాజీనామా చేశానని, జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నష్టపోవడానికి కారణం మెతుకు ఆనంద్ వైఖరి అని ఆయన స్పష్టం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ యువజన నాయకుడు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాఘవేందర్‌గౌడ్

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ యువజన నాయ కుడు రాఘవేందర్‌గౌడ్ ఆదివారం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినంద నలు తెలియజేశారు. మేడ్చల్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మేడ్చల్ జడ్పీటీసీ శైలజా విజయేందర్‌రెడ్డి ఆదివారం సీఎం నివా సంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

కులకచర్లలో వీధి నాటకం



వీధి నాటకంలో పాత్రధారులు

కులకచర్ల, ఏప్రిల్ 7: కులకచర్లలో ప్రదర్శించిన శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర వీధి నాట కంలో చివరి రోజు సామాధి ఘట్టం ఎంతో ఆకట్టుకుంది. పది రోజులుగా నిర్వహిస్తున్న వీధి నాటకం శనివారం రాత్రితో ముగిసింది. సిద్దయ్య పాటలతో ఆహుతులను అలరించారు. పాత్రధారులను స్నేహితులు, కుటుంబ సభ్యులు సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో కమ్మరి నర్సింహులు, పిట్ల బాలయ్య, బోగం రాంచంద్రయ్య, వినోద్‌కుమార్, కృష్ణయ్య పాత్రలు వేశారు. వీరికి స్థానికులు మాజీ ఉప సర్పంచ్ పండరయ్య శర్మ, కరణం రఘు సహకారం అందించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



కొండాపూర్‌లో వాహన తనిఖీ చేస్తున్న సీఐ సైదులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో ప్రతీఒక్కరు ఎన్నికల నియమావళిని పాటించాలని ఘట్‌కేసర్ సీఐ సైదులు అన్నారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి కొండాపూర్, అవుషాపూర్‌లలో ఆదివారం ఆయన వాహ నాల తనిఖీలు చేపట్టారు. వరంగల్-హైదరబాద్ జాతీయ రహదారి అవుషాపూర్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి 24/7 తని ఖీలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల నియమావళి నిబంధన లకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కి పరామర్శ



బాలయ్యను పరామర్శిస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కులకచర్ల, ఏప్రిల్ 7: కామునిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బాలయ్య అనా రోగ్యానికి గురై హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. ఆయనను పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పీరంపల్లి రాజు, మాజీ సర్పంచ్ మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మర్పల్లి, ఏప్రిల్ 7: మర్పల్లి మండలంలోని కొత్లపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మే ళనం జరుపుకున్నారు. పాఠశాల వదిలి 18 సంవత్సరాలు గడు స్తున్నా తిరిగి ఆత్మీయ సమ్మేళనంతో ఒకే దగ్గర కలుసుకోవడం సంతోషానిచ్చిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. పాఠశాలలో విద్యను అభ్యసించిన సమయంలో ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులను శాలువా లతో, పూలమాలలతో పూర్వ విద్యార్థులు సన్మానించారు. పాఠ శాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

వీరశైవ లింగాయత్ అధ్యక్షుడిగా సంతోష్

వికారాబాద్, ఏప్రిల్ 7 : వికారాబాద్ వీరశైవ లింగాయత్ అధ్యక్షుడిగా దోమ సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ఆలంపల్లి కెంపిన మఠంలో దుద్దిని పీఠాధిపతి చెన్న బసవ ప్రభు స్వామి సమక్షంలో నిర్వహించిన యువదళ్ ప్రత్యేక సమావేశంలో 2024-26 సంవత్సరానికి సంబంధించి కొత్త కార్య వర్గం ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షుడిగా తొండపల్లి సంతోష్, గొల్లెన్ అమర్, ప్రధాన కార్యదర్శిగా మఠపతి అఖిల్, సంయుక్త కార్యదర్శులుగా సదాశివుని సంతోష్, గాండ్ల విక్రమ్, కోశాధికారి సుధీర్ పటేల్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మఠపతి రాకేష్, శెట్టి మహేష్, ప్రచార కార్యదర్శులుగా కోటపల్లి సంతోష్, యాలాల కోటిలింగం, అధికార ప్రతినిధి జాక వెంకటేష్, కార్య దర్శులుగా కోల్కొంద భానుచందర్, గాజుల సంతోష్, కూర అమర్ నాథ్, ముఖ్య సలహాదారులు మఠం చంద్రశేఖర్, గుండుమల్ల కిషోర్, కార్యనిర్వాహక సభ్యులు కిరణ్ కుమార్, గాండ్ల సంతోష్, సందీప్, పట్నం జగదీష్‌లు ఎన్నికయ్యారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



చౌదరిగూడ మాజీ సర్పంచు బైరు రమాదేవికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 7: చౌదరిగూడ గ్రామ మాజీ సర్పంచ్‌లు బైరు రమాదేవి, బైరు రాములుగౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, వెంకటసాయినగర్ అసోసి యేషన్ అధ్యక్షుడు పార్థీవరెడ్డిలు పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆధ్వ ర్యంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ క్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి నివాసంలో ఆదివారం నిర్వహించిన కార్యక్ర మంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన బైరు రమాదేవి రాములుగౌ డ్‌లు చౌదరిగూడలో గట్టి పట్టు కలి గిఉన్నారు. బైరు రాములుగౌడ్ గత కొన్ని సంవత్సరాలుగా సర్పంచ్‌గా, ఉపసర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యు డుగా వారి కుటుంబం నుంచి గెలు పొందారు. కొంతకాలంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహంగా ఉన్న బైరు దంపతులు ఎట్టకేలకు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీఎ మ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి కీసర ఎంపీపీ

కీసర: బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీసర ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్ అధ్వర్యంలో ఆదివారం నగరంలోని రేవంత్‌రెడ్డి నివాసంలో కీసర ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీ నారాయణ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంపీపీ దంపతులకు కండువాను కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిం చారు. పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానని ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ ఈ సందర్భంగా తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కీసర ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ

ఎండలతో నిర్మానుష్యంగా రోడ్లు

● ఇళ్ల నుంచి బయటకు రాని జనం

కులకచర్ల, ఏప్రిల్ 7: వేసవి ఎండలు వారం రోజులుగా దంచికొడుతున్నాయి. భానుడి తాపంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. కులకచర్ల మండలంలో రికార్డు స్థాయిలో 42 డిగ్రీలు దాటింది. ఉదయం 7 గంటల నుంచి మొదలవు తున్న ఎండ వేడిమి రాత్రి 7గంటలు దాటిని తగ్గడం లేదు. నిత్యం రద్దీగా ఉండే రోడ్లు పగటి పూట నిర్మానుష్యంగా మారుతుండటంతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ వేడి మితో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ముఖాలకు, తలకు రక్షణ కవచాలతో ప్రయాణికులు బయటకు వస్తున్నారు. మరో వైపు ఎండలతో గిరాకీలు తగ్గిపోవడంతో వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు. వివిధ అవసరాలకు కులకచర్లకు వచ్చిన ప్రజలు చౌర స్తాలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవ డంతో కూల్‌డ్రింక్స్, పండ్లరసాలు సేవించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు మధ్యాహ్నం సమయంలో బయటకు రావద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితు ల్లోనే బయటకు రావాలని సూచిస్తున్నారు.



కులకచర్లలో ఎండ వేడిమికి నిర్మానుష్యంగా మారిన ప్రధాన రోడ్డు

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి



అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణలో పాల్గొన్న పరశురాం, తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 7: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబే డ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు గుజ్జుక పరశురాం తెలిపారు. మండలంలోని ఎదులా బాద్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం 56వ జ్ఞానమాలను పరుశురాం సమ ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయసాధ నకు యువత నడుంబిగించాలని కోరారు. సమాజంలో హక్కులు, విధుల గురించి తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రతీఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎదు లాబాద్ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు దుర్గేష్, సభ్యులు మల్లేష్, మురళి, లింగం, అనిల్, సాయికుమార్, నాగరాజు, సుమంత్, రాజు, శ్రీశైలం, శ్రీను, వంశీ, నీరజ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబే డ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు పవన్ నాయక్ ఆదివారం ఎదులాబాద్ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వా హకుడు మీసాల అరుణ్‌కుమార్, సచిన్, దాసు, రాజేష్, సత్యం, కళ్యాణ్, శ్రీని వాస్, సురేష్, దేవేందర్, గంగారాం, అంజనేయులు, గణేష్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధులు

చలివేంద్రాలు ప్రారంభం



వికారాబాద్: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జయంతిక జ్ఞాని, సత్యనారాయణ

వికారాబాద్, ఏప్రిల్ 7: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా దివ్య అనుగ్రహ ఆశీ స్సులతో ఆదివారం సత్య సాయి సేవా సమితి ఆధ్వ ర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ చౌరస్తాలో డాక్టర్ జయంతిక జ్ఞాని, డాక్టర్ సత్యనారాయణ గౌడ్‌లు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీవైసీ బసవేశ్వర్, వేణుగోపాల్, సత్యం, లక్ష్మణ్, భీమ్ రెడ్డి, సుధీర్, కిషోర్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండలం లోని అవుషాపూర్‌లో ఆదివారం ఆయన చలివేంద్రం ప్రారంభించి మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏనుగు కావేరిమశ్చేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, నాయకులు మశ్చేందర్ రెడ్డి, జిల్లాల రాజశేఖర్‌రెడ్డి, సాయిలు, రవీందర్, సదానంద్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ మమ తాకృష్ణారెడ్డి వార్డు పరిధి ఎస్వీనగర్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఆది వారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పలువురికి మంచినీటిని పంపిణీ చేసారు. ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చడం సమాజిక బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కౌకుంట్ల కృష్ణారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మున్సిపల్ ఆధ్వర్యంలో ఆదివారం మేడ్చల్ పట్ట ణంలోని వివేకానంద విగ్రహం వద్ద చలివేంద్రమును ఏర్పాటు చేశారు. ఆది వారం మున్సిపల్ సిబ్బంది రాంచందర్, శంకర్, బిక్షపతిలు నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రను ప్రారంభించారు.

ఘట్‌కేసర్: బాటసారుల దాహార్తిని తీర్చడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. అన్నోజిగూడలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఆదివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నానావత్ రెడ్డియా నాయక్, సింగిరెడ్డి సాయిరెడ్డి, సత్తిరెడ్డి, శేఖర్, జితేందర్ నాయక్, కేఎంరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాండూరులో త్వరలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు



సమావేశంలో శ్రీనివాసచారి, వేణుగోపాల్‌రెడ్డి

తాండూరు రూరల్, ఏప్రిల్ 7: త్వరలోనే తాండూరులో ప్రెస్ క్లబ్ ఏ ర్పాటు చేసేందుకు కృషి చేస్తామని టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అ ధ్యక్షుడు శ్రీనివాసచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. తాండూరులోని సాయిమేధ పాఠశా లలో ఆదివారం టీయూడబ్ల్యూజే-ఐజే యూ డివిజన్ అధ్యక్షుడు పెరుమాళ్ల వెంకట్‌రె డ్డి, కార్యదర్శి రామకృష్ణల ఆధ్వర్యంలో నియోజ కవర్గంలోని తాండూరు పట్టణం, తాండూరు, యాలాల, బషీరాబాద్ మండలాల అధ్యక్ష, కా ర్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి మాట్లా డుతూ జర్నలిస్టులందరికీ బీమా సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అ దేవిధంగా తపాలా శాఖలో అమలవుతున్న బీ మా పథకాన్ని నమోదు చేసేందుకు నిర్ణయిం చామన్నారు. దీని ద్వారా రూ.10లక్షల వరకు బీమా వర్తిస్తుందన్నారు. ఈ మేరకు నియోజక వర్గంలో అర్హులైన జర్నలిస్టులు సమన్వయ క మిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాం డూరు ప్రెస్‌క్లబ్ నిర్మాణంతోపాటు తాత్కాలిక భవనాన్ని ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామన్నారు. జర్నలిస్టు సమన్వయ కమి టీ సభ్యులుగా తాండూరు టౌన్ మహేష్, యాలాల జావెద్, బషీరాబాద్ శివకుమార్, పె ద్దేముల్ పాండు, తాండూరు మండలం శాం తులను నియమించారు. ఈ సమావేశంలో వెంకట్‌రెడ్డి, రాంచందర్, నర్సింహులు, నరేంద ర్, శాంత్‌కుమార్, లక్ష్మణ్, వెంకట్‌రాంరెడ్డి, వెం కటేష్, సంగమేష్, మహేష్, రాంరెడ్డి, జావిద్, రఘుమారెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

● **కొడంగల్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం కొడంగల్ నియోజకవర్గంలో పర్య టించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు కొడంగల్ పట్టణం లోని తన స్వగృహంలో మండలాల వారీగా నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటా రని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారు.

● **పరిగి:** పరిగి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నేడు(సోమ వారం) పరిగిలోని ఏబీఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మో హన్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రె డ్డి పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గం లోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయ వంతం చేయాలని కోరారు.

● **పరిగి:** రంజాన్ పర్వ దినం సందర్భంగా సోమవారం సాయంత్రం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఇఫ్తార్ విందు ఇస్తున్నట్లు టీఆర్ఎస్ ఆఫీస్ కార్యదర్శి ఆశోక్‌రెడ్డి తెలిపారు. ముస్లింలు, పార్టీ నాయకులు తరలిరావాలని సూచించారు.

● **తాండూరు:** పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు అవసరమగు ఈవీఎం యంత్రాలు నేడు(సోమవారం) తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు తీసుకోస్తున్నామని వాటిని సెయింట్ మార్క్స్ పాఠశాలలో గల స్ట్రాంగ్‌లో భద్రపరచనున్నట్లు సహాయ రిటర్నింగ్ అధి కారి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. మే 13న నిర్వహించ నున్న పార్లమెంటు ఎన్నికలపై తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు అవసరమైన 277 ఈవీఎం యంత్రాలు, రిజర్వు ఈవీఎం యంత్రాలు వికా రాబాద్‌లోని ఈవీఎం గోడౌన్ నుంచి తాండూరు స్ట్రాంగ్ రూమ్‌కు ఉదయం 11 గంటలకు తీసుకొస్తామని చెప్పారు.


ఉపవాస దీక్షలు చేపట్టిన చిన్నారులకు సన్మానం



ఉపవాస దీక్షలు చేపట్టిన చిన్నారులను సన్మానిస్తున్న ఆసిఫ్‌ఖాన్

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 7: రంజాన్ ఉపవాస దీ క్షలు చేపట్టిన చిన్నారులను కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ఆసిఫ్‌ఖాన్ సన్మానించారు. ఆదివారం స్థానిక మక్కా మస్జీద్‌లో ఉపవాస దీక్షలు చేపట్టిన 12 మంది చిన్నారులను మైనారిటీ నాయకు లు, ముస్లిం సోదరులతో కలిసి శాలువాలతో సన్మానిం చి అభినందించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నా యకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

తైక్వాండో అసోసియేషన్ చైర్మన్‌గా రాఘవన్‌నాయక్



ఉద్యోగాలు పొందిన వారిని సన్మానిస్తున్న తైక్వాండో అసోసియేషన్ సభ్యులు

వికారాబాద్, ఏప్రిల్ 7 : తైక్వాండో అసోసియేషన్ చైర్మన్‌గా అఖిల భారత గిరిజన రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. వికారాబాద్ పట్టణంలో ఆదివారం తైక్వాండో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా అధ్యక్షుడిగా కృష్ణ, కార్యదర్శిగా గోపాల కృష్ణ, కోశాధికారిగా రవి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నా రు. ఈ మధ్య కాలంలో తైక్వాండోలో శిక్షణపొంది పలు ఉద్యోగాల్లో విజయం సాధించి ఉద్యోగాలు పొందిన వారిని అసోసియేషన్ సభ్యులు సన్మానించారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి వ్యక్తి మృతి

వికారాబాద్, ఏప్రిల్ 7: రైలుకింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ పట్టణం రామయ్యగూడ గ్రామానికి చెందిన మగ్గ మనోహర్(24) పశువులు మేపుతూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ మధ్యనే పశువులు మేపడం మానేసి కూలి పనులకు వెళ్తుండేవాడు. మద్యానికి బానిసైన మనోహర్ రాత్రి ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లాడు. ఉదయం 7గంటల ప్రాంతంలో మనోహర్ రైలుకింద పడి మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. వారు అక్కడికి వెళ్లి చూసి మనోహర్‌గా గుర్తించారు. అయితే రాత్రి గుర్తుతెలియని రైలుకింద పడి మనోహర్ ఆత్మహత్య చేసుకుని ఉంటారని గ్రామస్తులు అంటున్నారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వికారాబాద్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నీటి సంపులో పడి చిన్నారి..

జీడిమెట్ల, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఆడుకుంటున్న ఒకటిన్నర సంవత్సరాల చిన్నారి ప్రమాదవశాత్తు ఇంటి ఆవరణలో ఉన్న మూతలేని నీటిసంపులో పడి మృతిచెందింది. ఈ విషాద ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ జిల్లా యాలాల మండలం రాఘాపూర్ గ్రామానికి చెందిన వడ్డేశివకుమార్, భార్య భర్తలు బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి షాపూర్‌నగర్‌లో నివాసముంటున్నారు. వీరికి కుమారుడు రఘురాం, కుమార్తె అశ్విని (ఒకటిన్నర సంవత్సరాలు) ఉన్నారు. వీరితో పాటు అత్త నాగమ్మకూడా ఉంటుంది. అత్తకు పుట్టినప్పటి నుంచి మాటలు రావు, చెవులు వినిపించవు. ఆదివారం కావడంతో భార్యాభర్తలు భోజనం చేసి నిద్రపోయారు. ఈ క్రమంలో పాప ఆడుకుంటూ ఇంటిముందున్న సంపులో పడిపోయింది. కొద్దిసేపటికి అత్త నీటికోసం వెళ్లి చూడగా నీటిలో చిన్నారి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. దీంతో కుటుంబసభ్యులు లేచిచూసేసరికి అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పాప కళ్ల ముందు విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న జీడిమెట్ల పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ టీచర్..

తాండూరు రూరల్, ఏప్రిల్ 7: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన అంగన్‌వాడీ టీచర్ చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని జినుగుర్తి గ్రామానికి చెందిన గంగబాయి(36) అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. కొంతకాలం కిందట ఆమె భర్త మృతిచెందడంతో మనోవేదనకు గురైం ది. ఈక్రమంలో గంగబాయి జీవితంపై విరక్తిచెంది కల్లుకు బానిసైంది. ఈనెల 1వ తేదీన గంగబాయికి కడుపునొప్పి రావడంతో భరించలేక పు రుగుల మందు తాగింది. కుటుంబీకులు వెంటనే ఆమెను తాండూరు లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మె రుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ఆసుపత్రికి రెఫర్ చేశారు. గంగబాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కరన్‌కోట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

కీసర రూరల్, ఏప్రిల్ 7: మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు చోరీకి గురైంది. ఈ ఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య వివరాల ప్రకారం.. కీసర మండల కేంద్రంలో నివాసముంటున్న మెట్టు లక్ష్మి స్థానికంగా వెంకట సాయి థియేటర్ ఎదురుగా ఉన్న బాలాజీ స్వీట్‌హౌజ్‌లో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. కాగా స్వీట్ హౌజ్ సమీపంలోని యజమాని ఇంటి నుంచి టీ తీసుకొస్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెండలోంచి నాలుగు తులాల పుస్తెలతాడును అపహరించుకెళ్లారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దుండగుల ఆచూకీ కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కత్తులతో ఇరువర్గాల దాడి.. కేసు నమోదు

వికారాబాద్, ఏప్రిల్ 7: మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ధన్నారం తండాలో శనివారం రాత్రి ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా మద్యం మత్తులో మరో వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో కత్తులతో దాడికి పాల్పడటంతో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. వారిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

ప్రధాని మోదీ నాయకత్వంలోనే బీసీలకు న్యాయం



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

శామీర్‌పేట, ఏప్రిల్ 7: ప్రధాని మోదీ నాయకత్వంలో బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరుగుతుందని మల్కాజ్‌గిరి నియోజకవర్గ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. తూంకుంటలోని మొగుళ్ల రామ కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్లో మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్, జిల్లా నాయకుడు బుద్ధి శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మున్నూరుకాపు సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ఎంపీ, జాతీయ ఓబీసీ చైర్మన్ డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. వారిని మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం నాయకులు అభినందిస్తు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొంతం దీపిక, సింగం సత్తయ్య, సాయిబాబా, అరుణ, దివాకర్, పద్మయ్య, శ్రీనివాస్, విక్ర మ్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా అంతాయిపల్లి పరిధిలోని ఎస్ఎన్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈటల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన 60 మంది ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయ కుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: కేంద్రంలో బీజేపీ చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి తమ పార్టీ మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేసి గెలుపించాలని ఈటల రాజేందర్ సతీమణి జమున అన్నారు. ఆదివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మహిళ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మున్సి పల్ కౌన్సిలర్లు అమరం సరస్వతి, హంస రాణి కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరం

కీసర రూరల్, ఏప్రిల్ 7: ఉచిత వైద్య శిబిరాలను పురపాలక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల టీచర్స్ వెల్ఫేర్ అసోసియేన్ ఆధ్వర్యంలో ఆదివారం మెడి విజన్ కంటి ఆస్పత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మురైడ్డి, హన్మంత్‌రెడ్డి, సంఘ సభ్యులు శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కీసర, ఏప్రిల్ 7: మండలకేంద్రం కీసరలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో ఆదివారం కీసర సీతారామచంద్రస్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో దాదాపు 100మందికి కంటి, చర్మ, పంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌రెడ్డి, స్వప్నరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.